
ఈ వారం 'సరసం'

# అదుంటే ఉంటా!



—పైడికొండల

నాలుగ్గంటల నుంచి గడియారం వైపు ఎన్నోసార్లు చూసింది గాయత్రి. టైము గడవటం లేదనిపించింది. ఓ వైపు చిరాకు మరోవైపు కోపం. గడియారం నెమ్మదిగా కదులుతున్నట్టుగా ఫీలింగు. గేటు దగ్గరకు ఎన్నోసార్లు కూడా వెళ్ళి చూసి వచ్చింది. అతని కోసం.

గేటు దగ్గరకెళ్ళి కొంచెం దూరంలో నిర్మాణంలో వున్న అపార్టుమెంటు వైపు చూస్తే 'అతను' వస్తున్న, నిలబడిన విషయం తెలుస్తుంది. గాయత్రి అతన్ని చూడగానే కళ్ళతోటే పలకరించి, పెదవులతో 'రావచ్చు' అన్నట్లుగా నవ్వుతుంది. ఆ భాష అతనికి తెలుసు. వెంటనే అతను గటు దగ్గరకు రావడం, ఆమె గేటు తీయడం- అతను లోపలకు రావడం యాంత్రికంగా జరిగిపోతాయి. అతన్ని కూర్చోమనడం మంచి నీళ్ళివ్వడం కొంచెం సేపు కుశల ప్రశ్నలడగడం–ఆ తరువాత "పాలు కావాలా...కాఫీ కావాలా" అని అడిగడం గాయత్రికి అలవాటే. అతను కాఫీ వద్దంటాడు. ఆ తరువాత ఇద్దరూ "మరో లోకం"లోకి వెళ్ళిపోయి ఓ అరగంట గడిపొస్తారు.

గాయత్రి ఇప్పుడు కూడా ఆ 'మరో లోకం' గురించే ఆలోచిస్తోంది. ఆరాటపడుతోంది. తొందర పడుతోంది. కంగారు పడుతోంది. పైగా కలవరం ఒకటి...

అతని పేరు కుమార్. పదిహేను రోజుల్నుంచి అతని దర్శనమే లేదు. ఫలితంగా "మరో లోకం" చిన్నబోయింది. ఒంటరిదైపోయింది. వెలవెలబోతోంది. రోజూ యిలాగే ఎదురు చూస్తోంది. కాని నీరసమే మిగులుతోంది. కుమార్ వస్తే ఆ నీరసం పోతుంది. అతను అందించే టానిక్ అటువంటిది. గొప్ప టానిక్ పదే పదే కావాలనిపిస్తుంది మరి. ఏ మూలికలు, పసరులతో కుమార్ రక్తం నిండిందోగాని, అంతటి శక్తి వుంది అందులో. అని గాయత్రి బాగానే గుర్తించింది. అందుకే కుమార్ రాక కోసం ఎదురు చూపులు. దర్శనం కోసం ఆరాట పడుతోంది. తొందరపడుతోంది. గాయత్రి 'మరో లోకం'గా భావించే గదిలోకి వెళ్ళింది. మంచంమీద దుప్పటి సరిచేసింది. తలదిండ్లు అటు యిటు జరిపించింది. దుప్పటి వైపు కసిగా చూసింది. మత్తుగా చూసింది. అలవోకగా ఎలాగో అయిపోయింది. ఫలితంగా టానిక్కోసం పరుగు...

కుమార్ ఎందుకు రావటం లేదు. ఏమైంది... కనీసం నాలుగైదు రోజులకోసారైనా వచ్చి మరో లోకంలోని అనుభవాలను పంచి యిస్తాడు. అది అతనితో మరిచిపోలేని గొప్ప అనుభవంగా ఉంటోంది.

కుమార్ కోసం ఫోను చేసింది. కాని అతను లేడన్నట్లుగా జవాబు. అది విన్నప్పట్నుంచి మరింత కంగారు. ఆరాటం...ఆత్రం...ఎక్కువవుతోంది.

టైము ఆరున్నర. బాత్‌రూములోకెళ్ళింది స్నానం చేసేందుకు. "ఈ వెంకటయ్య మరో రెండు గంటల వరకు రాకుండా వుంటే బాగుండును– అనుకుందామె.

వెంకటయ్య, గాయత్రి భర్త తాలూకు బంధువుల కుర్రాడు. వాడికి పదిహేను పదహారేళ్ళుంటాయి. తల్లిదండ్రులు లేరు. ఇంట్లో పనిపాటలు చేస్తుంటాడని గాయత్రి భర్త రెండేళ్ళ క్రితం తీసుకొచ్చాడు.

కుమార్ అప్పట్లో పక్కింట్లో ఉండేవాడు. డిగ్రీ ప్యాసై ఏదో ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. వెంకటయ్య అతనితో కబుర్లు చెప్తుంటాడు. తను చదివే పత్రికలు, నవలలు కూడా చదువుతాడు వెంకటయ్య. అవి గాయత్రి కూడా చదువుతోంది. "ఆ నవల యిస్తారా...లైబ్రరీలో ఇచ్చేయాలి...ఈ వేళ గడువు రోజు" అని చాలా సందర్భాల్లో గాయత్రిని అడిగేవాడు కుమార్.

"గడువు రోజునే యివ్వాలేమిటి...చదవడం కొంచెం ముందు వెనుకా అవుతుంది. అయిపోయాక ఉంచుకోరుగా...సరే తీసుకెళ్ళండి" అంటూ యిచ్చేది గాయత్రి.

అలా యివ్వటం తీసుకోవటంలో పుస్తకాలు–నవలల ద్వారా వాడి చేతుల్లోని కరెంటు షాక్‌గా కొట్టేది. అయితే కరెంటుకు ఓ ప్రత్యేక లక్షణం ఉందేమో! మొదటిసారి రెండోసారి అయితే "సారీ" అని చెప్పాలనిపిస్తుంది. అదికాస్తా రెగ్యులర్ అయిపోతే విలువ ఉండదు. పైగా మరో విలువకు దారి పలుకుతుంది. అందుకు కళ్ళు, పెదవులు, మనసు మరింత ఎదురుచూపుల సన్నాహంలోకి సహకరిస్తాయని త్వరగానే అనుభవంలోకి వారికొచ్చింది.

గాయత్రికి ఆ అనుభవం గుర్తు కొచ్చింది.

ఆరేడు నెలల క్రితం–

ఇలాగే సాయంత్రం ఏడు గంటల సమయంలో గాయత్రి బాత్‌రూములో స్నానం చేస్తోంది. వెంకటయ్య గేటు దగ్గర నిలబడి దారినపోయే వాళ్ళను చూస్తున్నాడు. భర్త అప్పటికి క్యాంపు కెళ్ళి పదిహేను రోజులు దాటింది. రోజూ భర్త కోసం ఎదురు చూస్తున్నా ఫలితం లేకపోవడం...టానిక్ లేని శరీరం మరింత నీరసపడి పోవడం... కేవలం ఊహలు, ఆలోచనలతోటే తృప్తి పడటం బాధగాను, బెంగగాను వుండేది...

చటుక్కున కరెంటు పోయింది.

"వెంకటయ్యా" అంటూ అరిచింది గాయత్రి.

బెడ్ లైటు వెలిగించమని చెప్పేందుకు.

రెండు మూడుసార్లు అరిచింది. ఫలితం లేదు. వెంకటయ్య అప్పటికే బస్టాపు దగ్గరున్న పుస్తకాల షాపు వైపు వెళ్ళిపోయాడు. గాయత్రి ఎలాగో స్నానం పూర్తిచేసి టవల్ చుట్టుకుని హాలు పక్కనున్న బెడ్ రూము వైపు నడవబోతుంటే కరెంటు వచ్చింది.

ఎదురుగా కుర్చీలో కూర్చున్న వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయింది. పక్కింటి కుమార్. సిగ్గుతో తలొంచుకుని చేతులు ఛాతీకి కప్పుకుని ఏదో అనబోయింది. ఆమె కంగారు చూసి అతనన్నాడు "సారీ...నేను చూడలేదండి. మీరు లోపలకు వెళ్ళండి" అని.

"ఎందుకు వచ్చారు" అని అడగబోయింది.

"వెంకటయ్య సినిమా పత్రిక తీసుకెళ్ళాడు. ఇస్తానంటే వచ్చాను.• వాడు రోడ్డు మీద కెళ్ళాడు. ఇంతలో కరెంటు పోయింది. చీకట్లో బయటికెళ్ళడం బాగోదని... అన్నాడు కుమార్ నవ్వుతూ.

పది నిముషాల తరువాత సింగారం పూర్తి చేసుకుని వచ్చింది గాయత్రి.

ఆమెను చూసి కంగారుతో కలవరపడ్డాడు కుమార్. "దేవుడు మిమ్మల్ని అన్యాయం చేస్తున్నాడేమో...అయినా మీవారిని క్యాంపులకు పంపించి మీరు ఒంటరిగా కాలక్షేపం చేయడం బాగోలేదు. వేళకు భోజనం, టైముకి వ్యాయామం, సమయానికి నిద్ర లేకపోతే శరీరం ఊరికేనే అలసిపోతుంది.

"ఇప్పుడేమైందని" అడిగింది గాయత్రి.

"నేను చెబితే బాగుండదు...మీకు మాత్రం తెలియదా"

"కొత్త పత్రికలు...నవలలు...ఏమైనా తీసుకొచ్చారా"

"ఎదురుగా సుందరస్వప్నం చూస్తుంటే...వాటితో పనేమిటి..." ధైర్యం చేసాడు.

"ఈ వెంకటయ్యా యింకా రాలేదేమిటి...వీడితో యిదే గొడవ. వెంటనే రాడు" అంటూ గేటు దగ్గరకు వెళ్ళింది గాయత్రి.

"వాడు వచ్చేందుకు ఎంతైనా అరగంట దాటుతుంది. హోటలుకెళ్ళి టిఫిను తెమ్మన్నాను. మీరు ఏం అనుకోరని ధైర్యం చేసాను...సారీ..." అంటూ చేతులు జోడించబోయాడు కుమార్.

గాయత్రి లోపలకొచ్చి టివి ఆన్ చేసింది. రంజుగా...మజాగా...వేడెక్కించే వానపాట పదునెక్కిన సాహిత్యంతో హీరో హీరోయిన్లను ఎంతగానో మరెంతగానో మత్తుగా చిత్తు చేస్తుంది. ఉద్రేక పరుస్తోంది.

"అవసరం...సందర్భం అంటే ఇదే కాబోలు" అన్నాడు కుమార్ గాయత్రివైపు గుర్రుగా చూస్తూ.

అప్పుడు మళ్ళీ కరెంటు పోయింది.

చటుక్కున ముందుకెళ్ళాడు కుమార్.

అభ్యంతరం విదిలింపులు లేని ఏకాంత సమయంలో ఓ మధుర క్షణం...క్షణాలుగా దొర్లిపో సాగాయి. పదిహేను నిముషాలయినా కరెంటు రాలేదు.

"దయచేసి వెళ్ళిపోండి...ఎవరైనా చూస్తే బాగోదు" అంది గాయత్రి కంగారుగా... చెదిరిన చీరను సర్దుకుంటూ.

"సారీ. ఏదో ఆవేశంలో..."

"సరే...వెళ్ళండి"

మూడు రోజులు మూగగా దొర్లిపోయాయి. గాయత్రి కుమార్‌ని చూసేందుకు యిబ్బంది పడేది. అతనే ప్రహరీ గోడ దగ్గరకొచ్చి "మీరు ఏదో జరిగిపోయిందని మాట్లాడక పోవడం బాగోలేదు. అసలే ఒంటరివాడిని. ఎవరూ లేని వాడిని. పక్కనున్న మీరు కూడా చూడకుండా మాట్లాడకుండా ఉంటే నేనిక రూము ఖాళీ చేసేసి వెళ్ళిపోవలసి వుంటుంది. వెళ్ళమంటారా" దీనంగా అర్థిస్తున్నట్లుగా అడిగాడు అతను.

గాయత్రి అతనివైపు అదోలా చూసింది. ఏదోలా అయిపోతున్న ఫీలింగు.

కుమార్ గాయత్రి యింట్లోని హాలు వైపు చూస్తూ అన్నాడు "ట్యూబులైటు వేయకుండా బల్బు వేసారేమిటి...కరెంటు బోలెడవుతుంది. కరెంటు బిల్లు కట్టడానికి డబ్బు బాగా ఉంది లాగుంది" నవ్వుతూ.

"ఎందుకో సరిగా వెలగటం లేదు"

"వచ్చి చూడమంటారా"

"మీ యిష్టం" అన్నట్లుగా చూసింది గాయత్రి.

అతను గోడమీద నుంచే లోపలకు వస్తూ "ఫరవాలేదుగా" అన్నాడు.

గాయత్రి నవ్వింది.



కుమార్ ట్యూబును అటు యిటు కదిపి చూసాడు. స్టార్టరు తీసి పెట్టాడు. వైరు కూడా కదిపి చూసాడు. అప్పుడు ట్యూబులైటు వెలిగింది "లూజు కాంటాక్టు... ఇప్పుడు ఫరవాలేదు...ఇక ప్రాబ్లమ్ ఉండదు" అంటూ స్టూలు దిగాడు కుమార్.

"కాఫీ తాగుతారా" అడిగింది గాయత్రి.

"కాఫీని ఫీజుగా సరిపెట్టుకోవాలా..." నవ్వేసాడు.

"మరేం కావాలి" తనూ నవ్వేసింది.

అంతే...కరెంటు పోయింది.

"ఇప్పుడు చెప్తాను ఏం కావాలో" అంటూ గాయత్రి నడుం చుట్టూ చేయివేసి పక్క గదిలోకి తీసుకెళ్ళాడు.

ఇప్పుడు మునుపటి సిగ్గు, బెదురు గాయత్రిలో కనబడలేదు. కుమార్ కూడా కరెంటు వచ్చాక ఆమె గెడ్డం పట్టుకుని బుగ్గలపై నిమురుతూ "ఇవి బుగ్గలు కావు. ..లేత కొబ్బరి ముక్కలు..." అన్నాడు.

"మీలో రసికతతోపాటు కవిత్వం కూడా బాగా

ఎక్కువే" అందామె నవ్వుతూ.

"బాగానే గుర్తించారు. థాంక్స్. మళ్ళీ మళ్ళీ కరెంటు పోతూ వుంటే బాగుంటుంది కదూ. .." అంటూ గట్టిగా అల్లుకుపోయాడు.

జీవితంలో కొందరితో జరిగే అనుభవాలు, సంఘటనలు, స్థిరస్థాయిగా మిగిలిపోతాయి... వాటికి శాశ్వత ముద్ర పడిపోతుంది అని గుర్తుకొచ్చిన వ్డల్లా నవ్వుతోపాటు ఏదో ఎలాగో అనిపించక మానదు.

వారి పరిచయం మరింత ఫెవికాల్‌గా గట్టిపడి ఆత్రాన్ని తొందర పెట్టసాగింది తరచు.

గాయత్రి కుమార్‌ని ఆహ్వానించేందుకు ఓ కొత్త స్కీముని పథకాన్ని అలవాటు చేసుకోక తప్ప లేదు. వీలయినంత వరకు వెంకటయ్యను ఏదో పని మీద బయటకు పంపించడం రివాజయింది. ఆమె యింటి తలుపులు కుమార్ కోసం ఎప్పుడూ తెరుకునే వుండేవి. మోజు సరసం తృప్తిగా ఆనందంగా సంతోషంగా కరిగిపోతున్న మధుర క్షణాలు తీయగా...

ఇంచుమించుగా పద్ధెనిమిది నెలలు వారిని ఏకాంతంగా కలిపేసాయి.

అటువంటి సమయంలో కుమార్ ఇల్లు ఖాళీ చేయవలసి వచ్చింది–ఇంటి యజమాని ఇల్లు అమ్మేయటంతో.

అవిధంగా కుమార్ గాయత్రిని చూసేందుకు వీలుండేది కాదు. వీలు చేసుకోడం ఒక వంతు అయితే వెంకటయ్య ఇంట్లో వున్నాడేమోనన్న భయం మరోవైపు. అతనికి ఆమెపట్ల శ్రద్ధ, ఆసక్తి, మోజు తగ్గసాగింది. ఎప్పుడో పదిహేను రోజులకోసారి... కాని గాయత్రిలో మాత్రం మోజు ఎక్కువయిపోయింది. కుమార్‌ని దగ్గరలో ఏదో ఇంటిలో చేర్పించాలన్న ఆలోచన పెరగ సాగింది. అమాటే కుమార్‌తో అంటే 'చూడ' మన్నాడు. కాని టైము కూడా కలిసి రావాలిగా!

అప్పట్నుంచి వేట సాగించింది. వెంకటయ్యకు ఆ డ్యూటీ అప్పగించింది. భర్తతో కూడా చెప్పింది.

గాయత్రి కుమార్ కోసం గేటు దగ్గరే పడిగాపులు ఎదురు చూపుల అధ్యాయంలో గడిపేస్తోంది. ఆమెకు భర్తమీద ధ్యాస కంటే కుమార్ మీదే దృష్టి... ఎన్నోసార్లు యింట్లోకి, మరెన్నోసార్లు గేటు దగ్గరకు నడక...పరుగు...

సమయం ఏడు గంటలు కావస్తుండగా వచ్చాడు కుమార్. కళ్ళతోటే లైను క్లియర్ యిచ్చేసింది "ఎప్పుడా వచ్చేది...ఇంత వరకు ఏం చేసారు...వెంకటయ్య కూడా వచ్చే టైమయింది. ఎక్కడకు పోయాడో" అంటూ ముందు గదిలోకి ఆహ్వానించింది గాయత్రి.

ఆమెవైపు ఆశగా...ఆబగా...ఆకలిగా చూడసాగాడు. ఇన్ని రోజులు రాకుండా ఎలా ఉండగలిగారు" అడిగింది.

"మరిచిపోయాను... వెంకటయ్య స్టేషను దగ్గర కనిపించాడు. వాడిని 'అదుంటే ఉంటా' సినిమాకు పంపించి వచ్చాను. జనం విపరీతంగా ఉన్నారు. టిక్కెట్టు బ్లాకులో కొని మరీ పంపించాను. నేను నిన్ననే చూసాను. నీతో కలిసి కూడా చూడాలి" అంటూ ఆమెను మంచం మీదకు లాక్కున్నాడు కుమార్. అప్పుడు కరెంటు పోయింది.

"ఈ కరెంటు పోవడం మన వ్యవహారానికి ఓ గొప్ప వరంగా వుంటుందేమో" అన్నాడు కుమార్ నవ్వుతూ.

"మంచిదేగదా..." అంది గాయత్రి అతన్ని అల్లుకుంటూ.

పది నిముషాలు మజాగా, మధురంగా దొర్లిపోతున్న సమయంలో తలుపు చప్పుడయింది. ఇద్దరు అదిరిపడ్డారు. కుమార్ కంగారుగా అచేతనమైపోయాడు. గాయత్రి అతన్ని ముందు గది గుమ్మం దగ్గర ఉండమని చెప్పి బోల్టు తీసి వుంచింది. ఆ తరువాత హాలు తలుపు తీసింది–ఎవరూ–అంటూ.

"చీకట్లో తలుపులు వేసుకుని ఒక్కత్తివే ఏం చేస్తున్నావు...బయట కూర్చుంటే గాలి వేస్తుందిగా..." అన్నాడతను.

ఆ గొంతునిబట్టి గుర్తించింది గాయత్రి. అతను తన భర్త సీతాపతి! అతను లోపలకు వెళ్ళకుండా అక్కడే కూర్చున్నాడు–బ్రీఫ్‌కేసు కిందపెట్టి.

"ఉండండి...అగ్గిపెట్టె చూసి దీపం వెలిగిస్తాను" అంటూ లోపలకు వెళ్ళింది గాయత్రి.

ఓ నిమిషం తరువాత ముందు గుమ్మం నుండి కుమార్ వెళ్ళిపోవడం గాయత్రి కిరోసిన్ దీపం వెలిగించి రావడం..."క్యాంపు మరో నాలుగు రోజులుందేమో కదా..." అని అడగడం జరిగింది. ఓ వైపు భర్త రాకతో చిరాకు, కోపం...మరో వైపు హటాత్తుగా ఆగిపోయిన కార్యక్రమం..ప్రసారంలో అంతరాయంగా తయారైన పరిస్థితి.

"ఏం లేదు...నిన్న 'అదుంటే ఉంటా' సినిమాకు వెళ్ళాను. సినిమా చూస్తున్నంతసేపు నువ్వు గుర్తుకొచ్చావు. అంతే సినిమా అర్థంతరంగా మానేసి ఎక్కేసాను రైలు... ఇంతకీ వెంకటయ్య ఆ సినిమాకు వెళ్ళాడా ఏమిటి..." సీతాపతి అడిగాడు.

"ఎక్కడైనా కనిపించాడా వాడు" గాయత్రిలో కంగారు ఎక్కువైంది. దానికి తోడు చెమట్లు...ఆలోచనలు ఎటో పరిగెడుతున్నాయి. కాఫీ తెచ్చింది కొంచెం సేపయ్యాక "మళ్ళీ క్యాంపుకి ఎప్పుడు వెళ్ళాలి" అంటూ గ్లాసు అందించింది.

"ఈ రాత్రి పనైపోతే పొద్దున్నే వెళ్ళిపోవాలి" అన్నాడు సీతాపతి గ్లాసందుకుంటూ.

బతుకు జీవుడా అనుకుంది తను.

సీతాపతి గ్లాసు కింద పెట్టి గాయత్రిని దగ్గరకు లాక్కోబోయాడు. "కరెంటు రానివ్వండి. మరీ అంత తొందరైతే ఎలా" గాయత్రి నవ్వేసింది.

"వెంకటయ్యను వాళ్ళూరు పంపేస్తే ఎలా వుంటుంది" చటుక్కున అడిగాడు సీతాపతి.

"మీ యిష్టం" అనిమాత్రం అంది తెలివిగా.

"కుమార్ ఎక్కడుంటున్నాడో తెలుసా...ఈ మధ్య యిటువైపు వస్తున్నట్లుగా లేదు..." సీతాపతి అన్నాడు.

"మధ్యలో కుమార్ ఎందుకు గుర్తుకొచ్చాడు.. అయినా యిటుగా ఎందుకొస్తాడు..." గాయత్రి జవాబది.

మర్నాడు క్యాంపుకు బయలుదేరుతూ గాయత్రితో అన్నాడు సీతాపతి "మనం చేసే పనులు ఎదుటి వారి దృష్టిలో పడకూడదు...ఫలితంగా లేనిపోని గొడవలు... ఇబ్బందులు...ముఖ్యంగా ఎవరూ నన్ను 'ఇలా జరుగుతోంది తెలుసా' అని ప్రశ్నించకూడదు" అని.

తన గురించి ఆలోచించకుండా తన మాటకు విలువ నివ్వకుండా, తన ఉనికిని పట్టించుకోకుండా–గాయత్రి కుమార్‌తో చనువుగా ఉంటోందన్న విషయం సీతాపతికి బాగానే తెలుసు. అందుకే తరచు క్యాంపుల కెళ్ళిపోతున్నాడు అంతకన్నాఏమీ చేయలేక. ..చేసే ధైర్యమూ లేక...పూర్ ఫెలో...

●

